# నాడు విధ్వంసం.. నేడు పచ్చదనం

## స్వరాష్ట్రంలోనే పర్యావరణ పరిరక్షణ

- సీఎం కేసీఆర్ సారథ్యంలో హరిత విప్లవానికి నాంది
- ప్రభుత్వ సంకల్పానికి పచ్చని చెట్లే సాక్ష్యం
- భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- గాంధీనగర్, ఈటూరులో ఘనంగా హరితోత్సవం



గాంధీనగర్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్/నాగారం, జూన్ 19 : 70 ఏండ్ల పరాయి పాలనలో ధ్వంసమైన పర్యావరణానికి హరిత హారం గొప్ప వరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 13వ వార్డు గాంధీనగర్‌లో, నాగారం మండలం ఈటూరులో సోమవారం 9వ విడుత హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 2014కు ముందు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పట్టించుకున్న నాధుడే లేడన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం నడిపించిన తీరుగానే హరిత ఉద్యమం నిర్వహించి ప్రకృతి పునరుజ్జీవనానికి కృషి చేశారని తెలిపారు. దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతం నేడు పచ్చని పంటలతో, దట్టమైన చెట్లతో చూడముచ్చటగా ఉన్నదంటే హరితహారం వల్లేనని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే ప్రజల బతుకు చిత్రాన్ని మార్చడమే కాదు.. ధ్వంసమైన అడవులను పునరుద్ధరించడం, సకల జీవరాశులను సంరక్షించడమని సగర్వంగా చాటిచెప్పిన దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. అతి తక్కువ కాలంలో దేశంలో అత్యధిక గ్రీన్ రెవల్యూషన్ సాధించిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. తొమ్మిదేండ్లలో సూర్యాపేట జిల్లాలో 7.50కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాటిన 273.33కోట్ల మొక్కలు చెట్లుగా మారి ఆక్సిజన్ ఇవ్వడంతోపాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయని చెప్పారు. హరిత హారం 9వ విడుతలో భాగంగా ఒక్కరోజే 2లక్షల మొక్కలు నాటగా.. వర్షాలు పడిన తర్వాత వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ఆధునిక సమాజంలో మానవుడి మనుగడ, ఆయు ప్రమాణాలు తగ్గడానికి ప్రధాన కారణం పర్యావరణ కాలుష్యమేనన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అనారోగ్యాలకు చెట్లను పెంచడం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. హరిత తెలంగాణ సాధనలో 9 ఏండ్లలో ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యమే పచ్చని విజయానికి సాక్షి అన్నారు. భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణమని, ఆకుపచ్చ తెలంగాణ కోసం జరుగుతున్న ఉద్యమంలో స్కూల్ పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ రామానుజులరెడ్డి, కౌన్సిలర్ వట్టె రేణుక, బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ చాంద్‌పాషా, ఎస్కే రఫీ తదితరులు పాల్గొన్నారు.

### ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా హరితహారం : ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

నాగారంలో జరిగిన కార్యక్రమలో ఎమ్మెల్యే కిశోర్ మాట్లాడుతూ.. ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణకు హరితహారంలో రెండు లక్షల మొక్కలు నాటగా ఈటూరులో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా 2700 మొక్కలు నాటినట్లు చెప్పారు. 230 కోట్ల మొక్కలు లక్ష్యంగా హరిత హారం కార్యక్రమం మొదలైందని పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండు లక్షల మొక్కలు నాటేందుకు కలెక్టర్ వెంకట్రావ్ అధికారులతో అన్ని ఏర్పాట్లు చేయించినట్లు చెప్పారు. అనంతరం మండల కేంద్రంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయంలో, డి.కొత్తపల్లిలోని గంగదేవమ్మ తల్లి ఉత్సవాల్లో పాల్గని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్టర గొర్రెలు, మేకల పెంపకందారుల కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, కలెక్టర్ వెంకట్రావు, పీడీ కిరణ్‌కుమార్, తిరుమలగిరి మార్కెట్ చైర్మన్ కొమ్మినేని స్రవంతీసతీశ్, ఎంపీపీ కూరం మణీవెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు రజాక్, సర్పంచ్ పేరాల సరిత, తాసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ గాలి శోభారాణి, బీఆర్‌ఎస్ నాగారం మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, నిమ్మల శ్రీనివాస్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చేసే బీఆర్‌ఎస్‌లో చేరికలు

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం, జూన్ 19 : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని వల్లాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 16 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కొత్త, పాత తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొనరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కొల్లు సత్తిరెడ్డి, దావీద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



విద్యాసాగర్ (గౌరవాధ్యక్షుడు)



సత్యనారాయణ (అధ్యక్షుడు)



పార్థసారథి(ప్రధాన కార్యదర్శి)

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేయాలని ఐలు జాతీయ కార్యదర్శి సురేంద్రనాథ్ సూచించారు. ఐలు రాష్ట్ర మహాసభల అనంతరం సోమవారం రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించి మాట్లాడారు. రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి సమస్య సాధించే దిశగా పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఇక్కడ చట్టాలను సాధించుకునేలా తమ కార్యాచరణ ఉండాలని అన్నారు. మహాసభల్లో చేసిన తీర్మానాలు రాష్ట్రంలో అడ్వకేట్ రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు 10,000 స్టైఫండ్ ఇవ్వాలని, డెత్ బెనిఫిట్‌ను 4 నుంచి 10 లక్షలకు పెంచాలని, 41 ఏసీఆర్‌పీసీ దుర్వినియోగాన్ని అరికట్టాలని, నూతనంగా ఏర్పడిన జిల్లా కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, లా అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా విద్యాసాగర్, అధ్యక్షుడిగా కొల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పార్థసారథి, కోశాధికారిగా వేణుగోపాల్‌రావు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్ ఆజాద్, వనగంటి నాగేశ్వర్‌రావు, సీహెచ్ శైల, శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శులుగా రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రావు, కిషన్, ఇస్మాయిల్ అహ్మద్, మోత్కూరు వనజ, ప్రత్యేక ఆహ్వానితుడిగా నాగారం అంజయ్య, సభ్యుడిగా మామిడి వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

# జానారెడ్డికి పొలిటికల్ షాక్

- ఆయన స్వగ్రామం అనుముల నుంచి 40 కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, జూన్ 19 : మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డికి సోమవారం తన సొంతూరి ప్రజలు షాక్ ఇచ్చారు. గత 40 ఏండ్లుగా తన రాజకీయ ఎదుగుదలకు అండదండగా ఉన్న అనుముల గ్రామస్తులు హాలియా మున్సిపాలిటీలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన 40 కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ మాట్లాడుతూ 2018కి ముందు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన ప్రతి ఎన్నికలో కూడా జానారెడ్డి రిగ్గింగ్‌తోనే గెలిచాడే తప్ప.. ప్రజాబలంతో గెలువలేదని ఆరోపించారు. గత పాలకులు హాలియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాజకీయం చేసేవారని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ పాలనలో హాలియాలో ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో నేడు సుమారు 27 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెడ్ యార్డ్, డిజిటల్ లైబ్రరీ, ఆడిటోరియం నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ఎల్లవేళలా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, ఎడమ కాల్వ మాజీ చైర్మన్ మల్గిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు చేరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ ప్రసాద్‌నాయక్, కౌన్సిల్ సభ్యులు రావుల లింగమ్మ, మార్కెట్ డైరెక్టర్ సురబి రాంబాబు, దోరేపల్లి వెంకన్న, దుర్గారావు, జినకల ప్రసాద్, జానపాటి శ్రీనివాస్, బొడ్డుపల్లి ఈదయ్య, మహేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
కావలెను
సర్క్యులేషన్ డిపార్ట్‌మెంట్ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన (2) ఆఫీస్ అసిస్టెంట్స్ కావలెను.
ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును.
అర్హత: డిగ్రీ, MS Office & తెలుగు డిటిపి
ఇంటర్వ్యూ తేది: 21.06.2023, బుధవారం
సమయం ఉ॥10-00 గం॥ నుండి మ॥2-00 గం॥ల వరకు
సంప్రదించగలరు
నమస్తే తెలంగాణ యూనిట్ ఆఫీస్
సర్వే నెం.695, చర్లపల్లి, నిట్స్ కాలేజీ దగ్గర, నల్లగొండ యూనిట్
సెల్: 9182 777 972